క్లుప్తంగా

పరిశ్రమలు నెలకొల్పేందుకు పక్కా ప్రణాళికలతో రండి



డీఐఈపీసీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: చిన్న చిన్న యూనిట్ల రూపంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక ఔత్సాహికులు పక్కా ప్రణాళికలతో రావాలని, వారికి అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వి.ఆదిశేషు, నాబార్డ్ డెవెలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, పలు పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్లలో షాపులు.. రాకపోకలకు ఇబ్బందులు



బౌడారా రోడ్డులోని పూర్ణాకాంప్లెక్స్‌లో సెల్లార్‌లో నిర్వహిస్తున్న షాపులు



వన్ టౌన్ అల్లూరి విగ్రహం వద్ద రోడ్డు పక్కనే సెల్లార్లలో ఉన్న దుకాణాలు



నూనెమిల్లు వీధిలో పార్కింగ్ స్థలం లేక రహదారిపై అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

- వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ప్రయాణికుల అవస్థలు
- పాతనగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే సమస్య
- పూర్ణామార్కెట్‌కు రావాలంటేనే భయపడిపోతున్న వినియోగదారులు

జగదాంబ: వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించాల్సిన సెల్లార్లు వాణిజ్య అవసరాలకు ఉపయోగించడంతో వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్ణామార్కెట్ దరి స్ప్రింగ్ రోడ్డు, బౌడారా రోడ్డు, నూనెమిల్లు వీధి, ప్రసాద్ గార్డెన్స్, పండుపుల్లల సందు, వన్‌టౌన్ ప్రధాన రహదారిలో భవన యాజమానులు సెల్లార్లు వ్యాపారులకు అద్దెలకు ఇచ్చేస్తున్నారు. ఆయా



దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లోని ప్రధాన రహదారి మొత్తం సెల్లార్లలో ఉన్న దుకాణాలు

భవనాల యజమానుల వాహనాలు, ఆ షాపులకు వచ్చే వినియోగదారుల వాహనాలన్నీ రోడ్ల మీదే పార్కింగ్ చేస్తుండడంతో రహదారులన్నీ విపరీతమైన రద్దీతో నిండిపోతున్నాయి. ఆ ప్రాంతాల గుండా ప్రయాణించే వాహనాల గమనానికి వీల్లేకుండా పోతోంది. దీనికి తోడు పాతనగరంలోని అనేక ప్రాంతాల్లోని ఫుట్‌పాత్‌లు కూడా చిరు వ్యాపారుల ఆక్రమణలో ఉండడం వల్ల పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆ ప్రాంతాలన్నీ రద్దీ ఏర్పడి వాహన చోదకులు వెళ్లడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా బౌడారా రోడ్డులో దుకాణాల ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేస్తే వ్యాపారులు తగాదాలకు దిగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

తొలగించిన దుకాణాలు మళ్లీ ప్రత్యక్షం..

ఇటీవల పూర్ణామార్కెట్ మొదలుకుని బౌడారారోడ్డు, రామకృష్ణా జంక్షన్ వరకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఫుట్‌పాత్ ఆక్రమణలు ఖాళీ చేయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చర్యలు మూడునాళ్ల ముచ్చటే అయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను ట్రాఫిక్ పోలీసులు కష్టపడి తొలగిస్తే పూర్ణామార్కెట్ నుంచి పాతనగరంలోని చాలా ప్రాంతాల్లో పూర్వంలాగే దుకాణాలు ప్రత్యక్షమయిపోయాయి. ఈ వైనాన్ని ట్రాఫిక్ పోలీసులు మౌనంగా చూస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

వినియోగదారుల ఇక్కట్లు..

పండుపుల్లల సందు, బౌరాడా రోడ్డు, స్ప్రింగ్ రోడ్డులో ఈ దుస్థితి మరింత ఎక్కువగా ఉందని ప్రజలు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్దకు వెళ్లాలంటే పండుపుల్లల సందు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఆ పండుపుల్లల సందు దాటడమే గగనమవుతోందని పలువురు వాపోతున్నారు. అక్కడ అక్రమ దుకాణాలే ఎక్కువగా ఉండడంతో లోపలికి వెళ్లలేక వెనుదిరగాల్సి వస్తోందంటున్నారు. ఇదిలా ఉంటే మంచాల వీధిలో కూడా మనుషులు మసిలేందుకు.. వాహనాలు తిరిగేందుకు ఏమాత్రం అవకాశం లేకుండా పోతోంది. వన్‌టౌన్ నుంచి టౌన్‌లోకి వచ్చే ప్రధాన రహదారి పూర్తిగా మంచాల వ్యాపారుల ఆక్రమణలోనే లుంది. అలాగే పాత బస్టాండ్ ఏరియా కూడా ఇలాగే ఉండడంతో మార్కెట్‌కు రాలేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

సెల్లార్లలో దుకాణాలు పెట్టకూడదు. జీవీఎంసీ నిబంధనల ప్రకారం సెల్లార్లు వాహనాల పార్కింగ్ కోసమే ఉపయోగించాలి. ఇటీవల పూర్ణామార్కెట్ దగ్గర ఆక్రమణలు తొలగించాం. దానిని దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు సెల్లార్లు ఖాళీ చేసుకోవాలి. లేకుంటే తగిన చర్యలు తీసుకుంటాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్

నేడు దుకాణాలు, కల్యాణ మండపాలకు వేలం పాట

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలో వివిధ దుకాణాలు, కల్యాణ మండపాలకు సంబంధించి ఈనెల 29న వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26కు సంబంధించి జోన్ పరిధిలో జగదాంబ వాణిజ్య సముదాయం, డైస్ ట్యాంక్ వద్ద ఉన్న గ్రౌండ్‌ఫ్లోర్ దుకాణాలు, ఓల్డ్ బస్టాండ్ ఫేజ్–2, పద్మానగర్, సూర్యాబాగ్, టీఎస్ఆర్ కాంప్లెక్స్, కనకల దిబ్బ, అంగడి దిబ్బ వద్ద ఉన్న దుకాణ సముదాయాలు, జీవీఎంసీ 37వ వార్డులో ఉన్న అంబేడ్కర్ కల్యాణ మండపానికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 29వ తేదీన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలంలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

క్రీస్తుయందు భయభక్తులు కలిగి జీవించాలి



శిలువ మార్గం చూపిస్తున్న ఫాదర్లు

కంచరపాలెం: క్రీస్తు యందు భయభక్తులు కలిగి జీవించాలని జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ అన్నారు. పాస్కా కాలం 3వ శుక్రవారాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణగిరిలో పరిశుద్ధ శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీస్తునందు భయభక్తులు కలిగి ఉండడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అనంతరం దివ్యబలిపూజ నిర్వహించారు. ఏప్రిల్ 18న జరగనున్న గుడ్‌ఫ్రైడే వేడుకలకు రక్షణగిరిని ముస్తాబు చేస్తున్నట్లు కమిటీ నిర్వహకుడు బేతా జోసెఫ్ తెలిపారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థ సేవకులకు ఘన నివాళి



సంస్థ సేవకులకు నివాళులర్పిస్తున్న సభ్యులు, ట్యూషన్ పిల్లలు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సంస్థ సభ్యులు, సంస్థకు నిత్యం సేవలందించి ఇటీవల మృతి చెందిన పలువురికి శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. సంస్థకు సేవలందించిన సీనియర్ సభ్యురాలు సోములమ్మ, ఇల్లా అప్పారావు, అశోక్, సంస్థ సేవకుడు శ్రీను చిత్రపటాలకు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సంస్థకు వారందించిన సేవలు గుర్తు చేసుకుని సేవా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. అనంతరం వారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, అప్పలకొండ, సూరి, చంద్రరావు, నల్ల రాజు, ట్యూషన్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



కేవీబీ నూతన శాఖను ప్రారంభిస్తున్న డాక్టర్ సంధ్యాదేవి

దాబాగార్డెన్స్: కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖను పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో శుక్రవారం ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవీబీ నూతన శాఖ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత వాసులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పొదుపు, కరెంట్ ఖాతాలు, డిపాజిట్లు, రుణాల వంటి సమగ్ర బ్యాంకింగ్ సేవలు అందిస్తుందని బ్యాంక్ ప్రతినిధులు తెలిపారు. లాకర్ సదుపాయం కూడా ఉందని, ఈ శాఖ అన్ని ప్రాథమిక బ్యాంకింగ్ లావాదేవీలు, కస్టమర్ల అవసరాలు తీరుస్తుందన్నారు. 2024–25లో బ్యాంక్ 46 శాఖలు ఏర్పాటు చేసిందని, బ్యాంకు శాఖల సంఖ్య 888కి పెరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు బ్యాంక్ ప్రతినిధులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం: వివేకానంద కాలనీలో వెలసిన వారాహి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు.

ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిరప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాల్లో జిల్లా విజిలెన్స్– మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు వివరించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని చెప్పారు. ఎమ్మెల్సీ రవీంద్రబాబు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్, విశాఖ, భీమిలి ఆర్‌డీవోలు శ్రీలేఖ, సంగీత్ మహాదూర్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్ట్‌కు వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: గత కొద్ది రోజులుగా అనారోగ్య కారణంగా ఇబ్బంది పడుతున్న పేద జర్నలిస్ట్ జయశ్రీ మెడికల్ ఖర్చుల కోసం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు అందజేసి చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. నిత్యం పని ఒత్తిడిలో ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులకి తోడుగా ఉంటానన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 4 సెంట్ల స్థలం, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ల మంజూరులో నిర్లక్ష్యం చేయడం సరి కాదని వాసుపల్లి మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గురజాపు రవి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ, దళమంతుల మాణిక్యాలరావు, పి. అర్జున్ ప్రసాద్, దళమంతుల చిన్ని, వేణు, సాగర్, జి. రామరాజు, వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాకు చెక్ పెట్టాలి : సీపీ

విశాఖ సిటీ: విశాఖ మీదుగా ఎటువంటి మత్తు పదార్థాల రవాణా జరగకుండా నిరోధించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు అధికారులతో డీజీపీ (కోఆర్డినేషన్స్) ఎస్.బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ నగరంలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లపై పెడుతున్న నిఘా చర్యలపై ఆరా తీశారు. ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. డీసీపీ–1 అజితా వేజెండ్ల, డీసీపీ–2 మేరీ ప్రశాంతి, డీసీపీ (అడ్మిన్) కృష్ణకాంత్ పటేల్, డీసీపీ (క్రైమ్) లతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రూ.3 లక్షలు అందజేత

విశాఖ సిటీ: ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో మృతి చెందిన గౌరుగంట్ల దుర్గాప్రసాద్ కుటుంబానికి రూ.2 లక్షలు, ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన పత్రుని తిరుమల శ్రీనివాస, దున్న చంద్రశేఖర్‌లకు చెరో రూ.50 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 30 మంది బాధితులకు రూ.25.5 లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించినట్లు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 7995095793ను సంప్రదించాలని సూచించారు.

కూటమి హయాంలో అన్నీ ప్రైవేటీకరణలే

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ పరిధిలో అన్నీ ప్రైవేటీకరణ దిశగా పరుగులు తీస్తున్నాయని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి. గంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. సుమారు 245 కిలోమీటర్ల మేర 40 అడుగులు పైబడిన రోడ్లను 10 ఏళ్ల పాటు ప్రైవేటీకరించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారని పేర్కొన్నారు. అగనంపూడి టోల్‌గేట్‌ను శాశ్వతంగా ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తూ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిందన్నారు. పార్కులు, స్టేడియంలు, స్విమ్మింగ్ పూల్స్, క్రీడా మైదానాలు, ఖాళీ స్థలాలు, షాపులు కల్యాణ మండపాలు, మార్కెట్లు ఇలా అన్నీ 33 నుంచి 99 ఏళ్ల పాటు పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ భాగస్వామ్యం కింద ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారన్నారు. ఇటీవల నగర నడిబొడ్డు ఆర్‌కే బీచ్‌లో రూ.1500 కోట్లు విలువ చేసే 13.5 ఎకరాల భూమిని 99 ఏళ్లకి లులూ అనే బడా సంస్థకి ధారాదత్తం చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రజల ప్రయోజనాలకు ఉపయోగించాల్సిన ప్రజా ఉమ్మడి ఆస్తులను ప్రైవేట్, రాజకీయ శక్తుల లాభాలకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. చివరికి జీవీఎంసీ పరిధిలోని ఏడాదికి రూ.కోట్లు ఆదాయం వచ్చే వృత్తి పన్నును కూడా కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా రాష్ట్ర పరిధిలోకి ఈ నెల 5న బదిలీ చేసిందన్నారు. నీటి చార్జీలు, మురుగునీటి చార్జీల పెంపు, యూజర్ చార్జీల విధింపు వంటి భారాలకు ఒడిగడుతుందన్నారు. ఈ ప్రమాదకర విధానాలు ప్రజలు, పౌర సంస్థలు, కాలనీ సంఘాలు, అసోసియేషన్లు, మేధావులు ఐక్యంగా వెనక్కి తిప్పి కొట్టాలని గంగారావు విజ్ఞప్తి చేశారు.

పోలీస్ సిబ్బందికి రివార్డులు



ఆర్డర్ అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: కేసుల ఛేదనలో ప్రతిభ చూపిన 181 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులు అందజేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో నేర సమీక్షా సమావేశం సందర్భంగా గత నెలలో పలు కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న సీఐల నుంచి హోంగార్డుల వరకు అందరినీ సీపీ అభినందించారు.

భామిరెడ్డి సేవలు ప్రశంసనీయం



భామిరెడ్డిని సత్కరిస్తున్న పలు శాఖల అధికారులు

మహారాణిపేట: ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా ముఖ్య అధికారి డి.భామిరెడ్డి సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం బీచ్‌రోడ్డు ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఎఫ్ఎస్ఐ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా విశాఖ ముఖ్య అధికారిగా పని చేస్తూ ఈనెల 31వ తేదీన ఆయన పదవీ విరమణ చేయనున్నారు. విధి నిర్వహణలో భామిరెడ్డి అందించిన సేవలను పలువురు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు డాక్టర్ ఎ.బి.కార్, డాక్టర్ మనాస్ కుమార్ సిన్హా, ఇంజినీరింగ్ డైరెక్టర్ ధర్మవీర్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతాప్, కృష్ణా కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులు, మత్స్యశాఖ అధికారులు తదితరులు భామిరెడ్డిని సన్మానించారు.

పర్యావరణ పరిరక్షణతోనే సురక్షితమైన మనుగడ



కళాశాల విద్యార్థినులతో గ్రీన్ క్లైమేట్ సంస్థ సభ్యులు

కంచరపాలెం: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని గ్రీన్ క్లైమేట్ టీంఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి ఎకో వారియర్ జె.వి.రత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ మాణిక్య కుమారి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ పరిధిలో అమలవుతున్న ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. భూమి మీద ఏ జీవి అంతరించినా దాని ప్రభావం మానవాళి మీదే పడుతుందని హెచ్చరించారు. వేసవిలో మనం ఆహారంగా తీసుకునే దేశీయ పండ్ల విత్తనాలు సేకరించి విత్తన బంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకులు డాక్టర్ ఎన్. నాగరాజు, డాక్టర్ ఎం. పద్మ సుందరి, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, గ్రీన్ గ్లోబ్ నేచర్ క్లబ్ ప్రెసిడెంట్ కె.ప్రీతి, సెక్రటరీ ఎన్. మానస, ఎ.సంజన, ఎస్.లక్ష్మీకీర్తన తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థినుల ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, వివిధ సంస్థల ప్రతినిధులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 39 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. కళాశాల జేకేసీ విభాగం, నిర్మాణ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం మెరుగుపరుచుకుంటే ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. డ్రైవ్‌లో కాన్‌సెంట్రిక్స్ హెచ్‌ఆర్ వేణుగోపాల్, వీజీఎస్ హెచ్‌ఆర్ చైతన్య, యోకోమా హెచ్‌ఆర్ ప్రశాంత్ విద్యార్థినులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. కళాశాల ప్లేస్మెంట్ అధికారి, జేకేసీ కోఆర్డినేటర్ ఎం. విద్యాకల్పన మాట్లాడుతూ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న 135 మంది విద్యార్థులు పాల్గొనగా 39 మంది ఉపాధి అవకాశాలు పొందినట్టు తెలిపారు. కార్యక్రమంలో నిర్మాణ్ సంస్థ ప్లేస్మెంట్ అధికారి ఎం. మహేష్, కళాశాల జేకేసీ మెంటార్లు వీఎస్ రాజు, డి. ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ రచయితల జాతీయ శిబిరం



ముగింపు శిబిరంలో ప్రశాంసా పత్రాలతో అతిథులు, శిక్షకులు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ కేంద్రీయ హిందీ నిదేశాలయం, న్యూఢిల్లీ సౌజన్యంతో హిందీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన 8 రోజుల నవ రచయితల శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా కేంద్రీయ హిందీ సంస్థాన్‌కు చెందిన రామదాస్ నారాయణ తోండే, డాక్టర్ పురుషోత్తమ్ పాటిల్ సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. భాషాభివృద్ధిని ప్రోత్సహించడం, కొత్త రచయితలకు ప్రచురణ అవకాశాలతో పాటు మార్గదర్శకత్వం అందించడం ధ్యేయమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, కన్వీనర్ డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో భాషా సంపుటిని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. రచయితల్లో సృజనాత్మకతను, సొంత శైలిని అభివృద్ధి చేసి వారి భావాలను సరైన విధంగా వ్యక్తీకరించేందుకు మార్గదర్శనం చేయడంతో పాటు విద్యార్థులకు హిందీ భాషపై పట్టు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ నళినీ దత్త, డాక్టర్ అర్చన, డాక్టర్ ఎస్ దీప్తి, డాక్టర్ విజయభారతి, డాక్టర్ కోటేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి తొలేళ్ల ఉత్సవం



కొబ్బరితోటలో కొలువైన నూకాంబిక అమ్మవారు

అల్లిపురం: కొత్త అమ్మవాస్య సందర్భంగా కొబ్బరి తోటలో వెలసిన నూకాంబిక అమ్మవారి ఆలయంలోను, నేతాజీనగర్‌లో గల నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఘనంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి తొలేళ్ల ఉత్సవంలో భాగంగా భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఘటాలు కొబ్బరితోట, నేతాజీనగర్, ఎస్‌వీపీ నగర్ ప్రాంతాల్లో డప్పువాయిద్యాలు, గరిడి, భజన కార్యక్రమాల నడుమ తిరిగాయి. శనివారం ఉదయం అమ్మవారి దర్శనాల నిమిత్తం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుతోనే ఓబీసీలకు న్యాయం

దాబాగార్డెన్స్: దేశంలోని 52 శాతం జనాభా ఉన్న ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దీనిపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఓబీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో ఓబీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని, రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

వేడుకగా జర్నలిస్టుల ఉగాది సంబరాలు



మానికొండ చలపతిరావు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: జర్నలిస్టుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించడం పట్ల ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది నామ సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆంజనేయులు తెలిపారు. జర్నలిజంలో మానికొండ చలపతిరావు ధ్రువతారగా నిలిచారని బాబీవర్దన్ కొనియాడారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ డీకే బారువ, ఏసీఏ మీడియా మేనేజర్ జైకిషన్, ప్రముఖ సంఘ సేవకుడు మట్టపల్లి హనుమంతరావు, శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు, జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా కార్యదర్శి పి. నారాయణ, జి. శ్రీనివాసరావు, కె. మదన్, జగన్‌మోహన్, కె. శ్రీనివాస్, డి. రవికుమార్, సాంబశివరావు, రాంబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు యువతి



మయూరిని సోదరికి అప్పగిస్తున్న ప్రగడ వాసు

సీతమ్మధార: మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన చెప్పల మయూరి (22) విశాఖకు చెందిన యువకుడిని ప్రేమించి విశాఖ వచ్చేసింది. కొద్ది రోజుల తర్వాత ప్రేమికుడు వదిలేయడంతో జగదాంబ వద్ద రోడ్డు మీద ఒంటరిగా ఉండగా మహారాణిపేట పోలీసులు గమనించి ఏయూటీడీ సిబ్బందికి అప్పగించారు. ఆమెకు మహిళా షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. ఆమె దగ్గరున్న మొబైల్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం మయూరి అక్క జీవనరేఖ షెల్టర్‌కి రావడంతో మహారాణిపేట మహిళా కానిస్టేబుల్ ఎ.రమ్య సమక్షంలో మయూరిని అప్పగించారు.

అప్పన్న అన్న ప్రసాద పథకానికి రూ.3 లక్షల విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అల్లిపురానికి చెందిన ఎం.కూర్మారావు రూ.లక్ష 116 విరాళమిచ్చారు. దీంతో పాటు చందనం సమర్పణకు రూ.లక్ష, వచ్చే నెల 8న జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ముత్యాల తలంబ్రాల కొనుగోలుకు రూ.లక్ష విరాళంగా అందించారు. సంబంధిత చెక్కును సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో సూపరింటెండెంట్ విక్రమ్‌కు అప్పగించారు.